

రాజకీయ చైతన్యానికి నెలవు

- వాణిజ్య పంటలకు కేంద్రం
- పురాతన ఆలయాలకు నెలవు
- పునర్విభజనలో ఎస్సీ రిజర్వుగా మారిన నియోజకవర్గం
- డీబీటీ ద్వారా 3,26,638 మంది లబ్ధిదారులకు రూ. 1507.09 కోట్ల లబ్ధి
- నాన్ డీబీటీ ద్వారా 1,11,176 మంది లబ్ధిదారులకు రూ. 289.49 కోట్లు లబ్ధి

అభివృద్ధి పథంలో ప్రత్తిపాడు నియోజకవర్గం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు నియోజకవర్గం 1952లో ఏర్పడింది. 2004కు ముందు టీడీపీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గం ఆతరువాత కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కోటగా మారింది. 2004కు మందు నియోజకవర్గం ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, చేబ్రోలు, గుంటూరు రూరల్, పెదకాకాని, కాకుమాను, యడ్లపాడు మండలాల్లో విస్తరించి ఉండేది. అప్పటివరకు జనరల్ స్థానం అయిన నియోజకవర్గం 2008లో జరిగిన పునర్విభజనలో ఎస్సీకి రిజర్వు అయ్యింది. అంతేకాకుండా నియోజకవర్గం ఐదు మండలాలకు కుదించబడింది. ప్రస్తుతం ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరురూరల్ మండలాలు ఉన్నాయి. ఈ నియోజవర్గమంతా పూర్తిగా వ్యవసాయ ఆధారితమే.

ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీతో వైఎస్సార్ సీపీ అభ్యర్థికి పట్టం..

ఎమ్మెల్యేగా సుచరిత ఎన్నికై న నెలల వ్యవధిలోనే నియోజకవర్గంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హఠాన్మరణంతో.. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే మేకతోటి సుచరిత మహానేత వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పూర్తి బాసటగా నిలిచారు. తదనంతరం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించడంతో సుచరిత ఎమెల్యే పదవిని తృణప్రాయంగా త్యజించి రాజీనామా చేశారు. దీంతో 2012లో నియోజకవర్గంలో ఉపన్నికలు జరిగాయి. 2012 ఉపఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగిన సుచరితకు ప్రజలు బాసటగా నిలిచారు. నియోజకవర్గ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 16,781 ఓట్ల భారీ మెజారిటీతో పట్టం కట్టారు. 2014లో జరిగిన ఎన్నికల్లో ఐఆర్ఎస్ అధికారి రావెల కిషోర్‌బాబు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019 ఎన్నికల్లో మరోమారు సుచరిత ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర హోంశాఖ మంత్రిగా రెండున్నర సంవత్సరాల పాటు కొనసాగారు.



ప్రత్తిపాడులో రూ. 62 లక్షలతో నిర్మించిన అగ్రిల్యాబ్

- ప్రత్తిపాడు నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారితం. ఇక్కడి రైతులు పత్తి, మిర్చి వంటి వాణిజ్య పంటలు అధికంగా సాగు చేస్తారు.
- నియోజకవర్గంలో ఒక ప్రైవేట్ మెడికల్ కళాశాల, ఫార్మసీ, కళాశాలలతో పాటు నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి.

రాజకీయ నేపథ్యం..

నియోజకవర్గ ప్రజలు ఇప్పటివరకు ఐదుసార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, ఒక సారి కాంగ్రెస్ ఐ అభ్యర్థి, ఒకసారి స్వతంత్ర్య అభ్యర్థి, ఆరుసార్లు టీడీపీ అభ్యర్థులకు, ఒకసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి పట్టం కట్టారు. 1952లో తమ్మాకోటమరెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా, 1957లో కృషీకార్ లోక్‌పార్టీ నుంచి గింజుపల్లి బాపయ్యచౌదరి, 1962లో పెదకాకాని నియోజకవర్గం కేంద్రంగా జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ నుంచి పంగులూరి కోటేశ్వరరావులు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1967లో ప్రత్తిపాడు నియోజకవర్గం మరోసారి ఏర్పడింది. దీంతో 1967లో స్వతంత్ర్య అభ్యర్థిగా మన్నె చిన నాగయ్య, 1972లో కాంగ్రెస్ పార్టీ నుంచి చుక్కా పీటర్ పాల్, 1978లో రెడ్డి కాంగ్రెస్ ఐ అభ్యర్థిగా కారుమూరి లక్ష్మీనారాయణ, 1983 నుంచి ఐదు పర్యాయాలు (1985, 1989,1994,1999) వరుసగా పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలెంకు చెందిన మాకినేని పెదరత్తయ్య టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికవుతూ వచ్చారు. అయితే 2004లో అదే గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రావి వెంకటరమణకు అవకాశం కల్పించారు. ఎన్నికల బరిలో నిలిచిన ఆయన వ్యూహాత్మకంగా అడుగులు వేసి రత్తయ్య ఆధిపత్యానికి గండికొట్టారు. 4,924 ఓట్లు మెజారిటీతో విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ సత్తాను చాటారు. అనంతరం 2009లో నియోజకవర్గం ఎస్సీకి రిజర్వు కావడంతో మేకతోటి సుచరిత కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయదుందుబి మోగించారు.

పథకాలు.. లబ్ధిదారుల వివరాలు (డీబీటీ)..
(2019 నుంచి ఇప్పటి వరకు)

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
అమ్మఒడి	21,286	74.88
విద్యాదీవెన	13,291	48.03
వసతిదీవెన	10,474	16.92
వైఎస్సార్ రైతు భరోసా	33,592	147.35
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	14,315	9.08
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు	11,107	28.69
రైతుల ఇన్‌పుట్ సబ్సిడీ	5,952	10.98
వైఎస్సార్ పెన్షన్ కానుక	29,043	871.29
వైఎస్సార్ చేయూత	13,771	58.87
వైఎస్సార్ ఆసరా	42,054	105.67
వైఎస్సార్ సున్నావడ్డీ	44,878	8.08
వైఎస్సార్ కాపునేస్తం	2,174	8.59
ఈబీసీ నేస్తం	3,985	11.81
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	13,153	46.77
వైఎస్సార్ ఆసరా	5,785	5.52
వైఎస్సార్ బీమా	1,692	9.05
వైఎస్సార్ వాహనమిత్ర	1,784	1.18
వైఎస్సార్ నేతన్న నేస్తం	267	1.82
జగనన్న చేదోడు	2,693	2.57
కోవిడ్ సాయం	49,364	6.71
జగనన్న తోడు	3,438	11.44
హౌసింగ్ చెల్లింపులు నేరుగా	2,630	19.63
మొత్తం	3,26,638	1507.09

పథకాలు.. లబ్ధిదారుల వివరాలు (నాన్ డీబీటీ)..
(2019 నుంచి ఇప్పటి వరకు..)

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
ఇళ్ల స్థలాలు	5,726	84.49
విద్యాకానుక	10,643	6.92
జగనన్న తోడు	5,919	10.86
జగనన్న గోరుముద్ద	9,365	10.41
విద్యార్థులకు ట్యాబ్‌లు	2,953	2.92
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	15,184	37.54
ఇంటింటికీ రేషన్	61,386	136.35
మొత్తం	1,11,176	289.49

పురాతన ఆలయాలకు ప్రసిద్ధి..



కాకుమాను మండలం కొండపాటూరులోని పోలేరమ్మ తల్లి దేవాలయం

- కాకుమాను మండలం కొండపాటూరులో కొలువుదీరిన పోలేరమ్మ తల్లి దేవస్థానంలో ప్రతి ఏటా శిడిమాను ఉత్సవం వేలాది మంది భక్తుల నడుమ వైభవంగా జరుగుతుంది.
- ప్రత్తిపాడు మండలం యనమదలలో కొలువుదీరిన సీతారామస్వామి దేవాలయం చిన్న భద్రాద్రిగా పేరు. భద్రాచలంలో జరిగినట్లే ఇక్కడ కూడా కల్యాణోత్సవం జరుగుతుంది. మర్నాడు శ్రీరామరాజ్య పట్టాభిషేకం, భారీ రథోత్సవం నిర్వహిస్తారు. 1824 సంవత్సరం నుంచి ఇక్కడ క్రమం తప్పకుండా ప్రతి ఏటా కల్యాణోత్సవం జరుగుతుండటం విశేషం.
- ప్రత్తిపాడులోని గంగాపార్వతీ సమేత దండేశ్వరాలయం (శివాలయం) 1067 సంవత్సరానికి ముందు గౌతమ మహర్షి ఈ ప్రాంతంలో కొన్ని సంవత్సరాల పాటు ఘోరతపస్సులు చేసి శివదర్శనానంతరం శివలింగాన్ని ఇక్కడ ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది. తదనంతరం కాకతీయ గణపతి దేవమహా రాజులు మంత్రి అయిన గోపరాజు రామన్నలు శాలివాహన శక వర్షంబులో 1067వ సంవత్సరంలో శివాలయాన్ని పునఃప్రతిష్ఠించారు.
- గుంటూరు రూరల్ మండలం జూనం చుండూరులోని సమ్మోహన వేణుగోపాలస్వామి ఆలయం 1500 సంవత్సరాల క్రితం నాటి పురాతన కోవెల బాదామి చాళుక్యులు, తూర్పు చాళుక్యులు కొండవీటి రెడ్డి రాజులైన కొమరగిరి, కర్పూర వసంత రాయలు వారి సోదరులు దర్శించుకున్న ఆధారాలు ఉన్నాయి.



క్లుప్తంగా

పెదకాకానిలో 17 మంది వలంటీర్ల రాజీనామా

పెదకాకాని: పెదకాకాని సచివాలయం 1 పరిధిలో పనిచేస్తున్న 17 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. వీరంతా ఎంపీడీఓ బివి మల్లేశ్వరరావుకు రాజీనామా పత్రాలను అందజేశారు.

అప్పాపురంలో 12 మంది..

అప్పాపురం(కాకుమాను):అప్పాపురంలో విధులు నిర్వహిస్తున్న 12 మంది వలంటీర్లు బుధవారం స్వచ్ఛందంగా రాజీనామ చేశారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుకు తమ రాజీనామ పత్రాలను అందజేశారు.

ఆర్ వీఆర్ జేసీలో ప్రాంగణ ఎంపికలు

గుంటూరు రూరల్: చౌడవరంలోనిఆర్ వీఆర్ జేసీ కళాశాలలో బుధవారం పలు సంస్థలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించాయి. ఇందులో ఆర్ వీఆర్ జేసీ కళాశాలకు చెందిన 64 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించారని యాజమాన్యం తెలిపింది.

2309 మందికి ఇంటింటికెళ్లి పింఛన్ల పంపిణీ

క్రోసూరు: మండలంలో మేనెలకు సంబంధించి సామాజిక పింఛన్లు పంపిణీ బుధవారం ప్రారంభమయింది. మొత్తం 8,814 మంది లబ్ధిదారులుండగా ఎన్నికల నియమావళి ప్రకారం 2309 మందికి వారిళ్లకు వెళ్లి అధికారులు పింఛన్లందించారు. మిగతా లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని ఎంపీడీవో ఎం.రమణ వివరించారు.

టీడీపీ, జనసేనకు గుడ్ బై

బెల్లంకొండ: వెంకటాయపాలెం గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 30 కుటుంబాల కార్యకర్తలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే ఏప్రిల్ 30న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బాష్యం ప్రవీణ్ సమక్షంలో చేరినవారు తిరిగి బుధవారం వైఎస్సార్‌సీపీ గూటికి చేరారు. మండలాధ్యక్షురాలు చెన్నప రెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి కండువాలు కప్పిసాదరంగా ఆహ్వానించారు

ప్రాంగణ ఎంపికల్లో చిప్స్ విద్యార్థులు

గుంటూరు రూరల్: హైదరాబాద్‌కు చెందిన దివీస్ లాబరేటరీస్ ఆధ్వర్యంలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 71 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని చిప్స్ యాజమాన్యం తెలిపింది.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

- పొన్నూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- అంబటికి గజమాలలతో స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు



21వ వార్డులో అంబటి మురళీకృష్ణకు స్వాగతం పలుకుతున్న నాయకులు



మెకానిక్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ఈ ఎన్నికలలో ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే అందరికీ మేలు చేస్తానని, నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టిస్తానంటూ పొన్నూరు వై సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన పథకాలు పొందిన వారంతా వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారని పేర్కొన్నారు. బుధవారం ప్రచారంలో భాగంగా పట్టణంలోని 21వ వార్డు ముబారక్ నగర్‌లో ప్రజలు, వ్యాపారులను ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా మెకానిక్ లు, టూవీలర్ హెల్పర్ అసోసియేషన్ నాయకులు అంబటికి ఘనస్వాగతం పలికారు. ముందుగా వర్కర్లకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. అంజుమన్ అధ్యక్షులు షేక్. మాము అధ్యక్షతన జరిగిన సమాఖ్య ఆత్మీయ సమావేశంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడారు. విద్యతోనే పిల్లలకు బంగారు భవిష్యత్ లభిస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికోసం అనేక పథకాలను అమలు చేసి పేద పిల్లలను బడిబాట పట్టిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా సమాఖ్య కార్యాలయానికి స్థలం కావాలని అంబటిని కోరగా, ఎమ్మెల్యే అయిన ఏడాదిలోనే భవనంతో పాటు, ఆదాయం సమకూరేలా చేస్తానని హామీ ఇచ్చారు. క్రిమినల్ కేసులుండటంతో తననెక్కడ అరెస్టు చేస్తారో అనే భయంతో ధూళిపాళ్ల నరేంద్ర ముసుగు దొంగలా మారి దాక్కుంటున్నారని అంబటి మురళీకృష్ణ ఆరోపించారు. టీడీపీ కూటమి ఓటమి ఖాయమని సర్వేలలో తేలడంతో ధూళిపాళ్ల నరేంద్ర గత వారం నుంచి ప్రచారానికి దూరమయ్యారని అన్నారు. ఓటమి కళ్ల ముందు కనబడుతుండటంతో ప్రజలను ఓటు అడగలేని స్థితిలో నరేంద్ర ఉన్నారన్నారు.సమావేశంలో రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్. సైపుల్లా , పార్టీ పట్టణ అధ్యక్షులు ఎంఏ. మహమూద్, షేక్. జాని, షేక్. కాలేషా, కార్యదర్శి కరిముల్లా, పాల్గొన్నారు. సేవా సంఘం ఆత్మీయ సమావేశంలో అంబటి మురళీకృష్ణ పాల్గొన్నారు. అందుబాటులో ఉండి సేవ చేస్తానని అన్నారు. విజయం చేకూర్చేలా ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని అభ్యర్థించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు కర్లపూడి రమేశ్ నాయకులు వడ్రాణం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశమివ్వండి..అండగా ఉంటా

ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని



పుసులూరులో ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తున్న బలసాని కిరణ్ కుమార్ రావిపాడులో బుల్లెట్ పై ప్రచారం చేస్తూ..

పుసులూరు(కాకుమాను): ఆశీర్వదించి అసెంబ్లీకి పంపండి..అందుబాటులో అందరికీ అండగా ఉంటా..సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానంటూ ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ అన్నారు.పెదనందిపాడు మండలం రావిపాడు, గోగులమూడి, పుసులూరు, పమిడివారి పాలెం, వరగాని, నాగులపాడు, పాలపర్తి,రాజుపాలెం గ్రామాల్లో బుధవారం బలసాని ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబం నుంచి వచ్చిన తనకు పేదల కష్టాలెలా ఉంటాయో తెలుసన్నారు. నిరుపేద కుటుంబాలు బాగుండాలంటే వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సీఎం జగనన్నకు ప్రజలంతా అండగా ఉండి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకువచ్చేలా అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రావిపాడు యువత కోరిక మేరకు బలసాని కిరణ్ కుమార్ బుల్లెట్ ఎక్కి ప్రచారంలో పాల్గొన్నారు. యువతను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ షేక్ ఖాసీంపీరా,ముప్వ శ్రీలక్ష్మి, వెంకటేశ్వర్లు, నరసింహారావు,శ్రీనివాసరావు,చెల్లి లక్ష్మీ,దుర్గా ప్రసాద్, కేశవరావు, సుబ్బారావు, పద్మారావు, కమ్మా సాంబశివరావు, చెరుకూరి సాంబశివరావు,జంపని సంజీవరావు, రాంబాబు, అల్లాడి వెంకటేశ్వర్లు, నాగయ్య, కె.సునీత, అన్నలదాసు సునీత, సంజీవరావు, కిశోర్,గేరా గణేష్, జంగా సుందర్,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో శ్రీపోలేరమ్మ

కొండపాటూరు(కాకుమాను): కొండపాటూరులో శ్రీ పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవంలో రెండో రోజైన బుధవారం నాడు భక్తులతో దేవాలయ ప్రాంగణం కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. రెండో రోజు అమ్మ వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

అభివృద్ధి సంక్షేమం సీఎం జగన్ తోనే సాధ్యం

- పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- అనుమర్లపూడి, తంగెళ్లమూడి, వెంకటకృష్ణాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



వెంకటకృష్ణాపురం బహిరంగసభలో పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకాని మండలం అనుమర్లపూడి, తంగెళ్ళమూడి, వెంకటకృష్ణాపురం, దేవరాయబొట్లవారిపాలెం గ్రామాల్లో బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. రామాలయం, మసీదుల్లో పూజలు, ప్రార్ధనల అనంతరం ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. వెంకటకృష్ణాపురంలో జరిగిన సభకు తోటకూర వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ రాజకీయాల్లోకి రాకముందే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకున్నానన్నారు. అందుకే సేవారంగంలో అడుగుపెట్టానన్నారు. వైద్య సేవలతో ప్రజలకు చేరువయ్యానన్నారు. నియోజకవర్గంలోని 60 గ్రామాల్లో పర్యటించి 27 వేల మందికి కళ్ళజోళ్ళు ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. లాభాపేక్ష లేకుండా సేవ చేసేందుకు మీ ముందుకు వచ్చి ఓటు అభ్యర్థిస్తున్నానన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పొన్నూరు నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని మురళీకృష్ణ కోరారు.

గతంతో పోల్చిచూడండి

25 ఏళ్ళుగా ఎమ్మెల్యేగా పనిచేసిన ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ చేసిన అభివృద్ధి, వైఎస్సార్ సీపీ ఐదేళ్ళ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలు బేరీజు చేసుకోవాలని అంబటి మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు. వెంకటకృష్ణాపురం గ్రామాల ప్రజలకు త్రాగునీరు అందించిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. సంగండైరీలో రూపాయి పెట్టుబడి పెట్టకుండా ధూళిపాళ్ళ నరేంద్ర ఆక్రమించుకున్నారని అంబటి ఆరోపించారు. ఆ డబ్బుతో 11 ఎకరాల్లో డీవీసి పేరుతో ఆసుపత్రి నిర్మించడం జరిగిందన్నారు. పాడి రైతులు అనారోగ్యానికి గురైతే ఉచితంగా వైద్యసేవలు అందిస్తానని ఆసుపత్రి నిర్మించి కార్పొరేట్ ఆసుపత్రిల్లో మాదిరిగా ఫీజులు వసూలు చేయడం జరుగుతోందన్నారు. అదే వైద్యానికి డైరీ నుంచి కూడా బిల్లులు పెట్టుకుని డైరీ సొమ్ము కొల్లగొడుతున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, ఎంపీటీసీ దంతాల శివపార్వతి, గ్రామ సర్పంచులు దానబోయిన సుభాషిణి, జిల్లెళ్ళ కిషోర్, మాజీ సర్పంచులు బద్దెపూడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమం.. అదే వైఎస్సార్ సీపీ లక్ష్యం



చేబ్రోలు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడపగడపకు సంక్షేమ ఫలాలు చేరాయని, అదే వైఎస్సార్ సీపీ ధ్యేయమని పొన్నూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీ కృష్ణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చేబ్రోలు మండలం శేకూరు, శేకూరుపాలెం, శలపాడు, వీరనాయకునిపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వచారు. స్థానిక మహిళలు ఆయనకు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలకగా, ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేశారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మే 13న జరిగే పోలింగ్ లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఒక ఓటు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, మరో ఓటు ఎమ్మెల్యే అభ్యర్థినైన తనకు వేయాలని కోరారు. సీఎం జగనన్న పాలనలో పారదర్శకంగా పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మరింత సంక్షేమం, అభివృద్ధి పొందేందుకు జగనన్నను మళ్ళీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.